
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
సోమవారం । 31 । మార్చి । 2025



సోమశిలలో 53.492 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో ఆదివారానికి 53.492 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 1080 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.92,400
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.8,360
3శాతం జీఎస్టీతో	రూ.8,611
నవర (8గ్రా)	రూ.68,888

గరిష్టం/కనిష్టం
36.5 /25.5

వాతావరణం

జిల్లాలో వాతావరణం సోమవారం పొడిగా ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ 67 శాతంగా ఆదివారం నమోదైంది.

న్యూస్‌రీల్

కనిపించిన నెలవంక

- ఈద్ – ఉల్ – ఫిత్ర్ నేడు



సంబరాలు జరుపుకొంటున్న ముస్లింలు

నెల్లూరు(బృందావనం): నింగిలో నెలవంక ఆదివారం దర్శనమిచ్చిందని ముస్లిం మతపెద్దలు ప్రకటించారు. దీంతో జిల్లా వ్యాప్తంగా ఈద్ – ఉల్ – ఫిత్ర్‌ను ఆనందోత్సాహాలతో సోమవారం జరుపుకొనేందుకు సమాయత్తమయ్యారు. ఈ నెల రెండు నుంచి కఠోర ఉపవాస దీక్షలను ఆచరించిన ముస్లింలు.. నెలవంక దర్శనంతో వీటిని ప్రత్యేక ప్రార్థనలతో ఆదివారం రాత్రి విరమించారు. బాణసంచా కాలుస్తూ మిఠాయిలు పంచుకొని ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. మసీదులు, ఈద్గాలు, గృహాల్లో దువా చేశారు.

నగరంలో సందడి

పండగకు అవసరమైన సామగ్రి, వస్త్రాలను కొనుగోలు చేసేందుకు భారీగా తరలిరావడంతో నగరంలో రద్దీ నెలకొంది. మరోవైపు నగరంలోని బారాషహీద్ దర్గా ఈద్గా వద్ద వేలాది ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలను సోమవారం చేసుకునేందుకు వీలుగా ప్రభుత్వ యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది.

నూతన సంస్కరణలతో ఇంటర్ విద్య

- కళాశాలల పునఃప్రారంభం రేపు
- ప్రథమ సంవత్సరానికి ఏడు నుంచి అడ్మిషన్లు
- ఆర్ఐఓ శ్రీనివాసులు



మాట్లాడుతున్న శ్రీనివాసులు


నెల్లూరు(అర్బన్): ఇంటర్ విద్యా వ్యవస్థలో సరికొత్త సంస్కరణలకు నాంది పలుకుతూ కళాశాలలను మంగళవారం పునఃప్రారంభించనున్నామని ఆర్ఐఓ ఆదూరు శ్రీనివాసులు తెలిపారు. ఈ మేరకు స్టోన్‌హౌస్‌పేటలోని కార్యాలయంలో విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడారు. 2023 జాతీయ పాఠ్య ప్రణాళికకు అనుసంధానం చేస్తూ ప్రజాస్పందనను పరిగణనలోకి తీసుకొని ఇంటర్ విద్యను బలోపేతం చేసేందుకు గానూ ఈ మార్పులను తీసుకొస్తున్నామని పేర్కొన్నారు.

అకడమిక్ షెడ్యూల్ ఇలా..

గతంలో మాదిరిగా జూన్ మొదటి వారంలో కాకుండా ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థులకు తరగతులను మంగళవారం ప్రారంభించనున్నామని ప్రకటించారు. ఏప్రిల్ 23 వరకు తరగతులను నిర్వహించి, 24 నుంచి జూన్ ఒకటి వరకు వేసవి సెలవులను ప్రకటించనున్నామని పేర్కొన్నారు. క్లాసులను జూన్ రెండున పునఃప్రారంభించనున్నామని వెల్లడించారు. ప్రథమ సంవత్సర విద్యార్థులకు అడ్మిషన్లు, తరగతులను ఏప్రిల్ ఏడున ప్రారంభించనున్నామన్నారు. వచ్చే ఏడాది నుంచి ఫిబ్రవరిలోనే పరీక్షలను నిర్వహించనున్నామని పేర్కొన్నారు. ఎంపీసీ, బైపీసీ విద్యార్థులు రెండు సబ్జెక్టులను చదివేలా ఎంబైపీసీ కోర్సునూ ప్రారంభించనున్నామని ప్రకటించారు.

వీఓఏల ఆక్రందన

ఉపాధి కల్పనే ధ్యేయమంటూ ఊకదంపుడు ఉపన్యాసాలు చేసి అధికారంలోకి వచ్చిన కూటమి సర్కార్ అందుకు భిన్నంగా వ్యవహరిస్తోంది. కొత్త ఉద్యోగాల మాట అటుంచితే.. ఉన్న చిరుద్యోగులపై ప్రతాపం చూపుతోంది. ఇప్పటికే వివిధ రంగాలపై కన్నేసి తమ పంతం నెగ్గించుకున్న తమ్ముళ్ల కళ్లు తాజాగా వీఓఏలపై పడ్డాయి. తమకు అనుకూలంగా ఉండే వారిని నియమించాలనే లక్ష్యంతో ఏళ్ల తరబడి పనిచేస్తున్న వీఓఏలను రోడ్డున పడేస్తున్నారు. ఒత్తిళ్లు తాళలేక.. ఏమి చేయాలో పాలుపోక వీఓఏలు నిస్సహాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.



ఒత్తిళ్లు చేసి రాజీనామా చేయించి..

- రోడ్డున పడేసిన కూటమి నేతలు
- చిరుద్యోగుల పొట్టకొట్టి..
- అనుకూల వ్యక్తుల నియామకం
- టీడీపీ నేతల కనుసన్నల్లో గ్రామ సమాఖ్యలు

కోవూరు మండలం గంగవరం వీఓఏగా శేషమ్మ వ్యవహరిస్తున్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక ఈమెపై కూటమి నేతలు కక్షగట్టారు. రాజీనామా చేయాలని నిరంతరం వేధింపులకు గురిచేయడంతో ఆవేదనకు గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు.

నెల్లూరు (పొగతోట): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చిరుద్యోగులపై ఆ పార్టీ నేతల దాష్టీకం పరాకాష్టకు చేరుతోంది. తమ పార్టీలకు మద్దతుగా ఉండే వారిని నియమించాలనే లక్ష్యంతో.. అప్పటికే విధుల్లో ఉన్న వారిని అనుక్షణం వేధింపులకు గురిచేస్తూ వికటాట్టహాసం చేస్తున్నారు. విధి లేని పరిస్థితుల్లో కొందరు రాజీనామాలూ చేశారు.


నిర్దాక్షిణ్యంగా తొలగిస్తూ..

వాస్తవానికి జిల్లావ్యాప్తంగా 36 వేల పొదుపు గ్రూపులున్నాయి. ఇందులో సుమారు 4.2 లక్షల మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. 1214 గ్రామ సంఘాలకు గానూ ఒక్కో వీఓఏ (విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్) చొప్పున నియమించారు. ఒక్కో గ్రామంలో వందకుపైగా గ్రూపులుంటే ఇద్దరు వీఓఏలు ఉంటారు. వీరు నిత్యం మహిళలతో సమావేశాలను నిర్వహిస్తూ వారి ఆర్థిక ప్రగతికి బాటలేస్తున్నారు. ఈ తరుణంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరాక వందలాది మంది వీఓఏలను నిర్దాక్షిణ్యంగా తొలగించారు. గ్రామ సంఘ బంధ తీర్మానంతో కోర్టును ఆశ్రయించగా, తొలగించొద్దని ఉత్తర్వులు జారీ చేసినా వాటిని అధికారులు ఏ మాత్రం అమలు చేయడంలేదు.

నిబంధనల ప్రకారం అయితే..

నిజానికి స్థానికంగా ఆయా గ్రామాల్లో ఉండే పొదుపు గ్రూపులు తీర్మానం చేసి ఒకర్ని వీఓఏగా నియమించుకుంటారు. ఈ ప్రక్రియలో అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎలాంటి సంబంధం ఉండదు. తీర్మానానంతరం సదరు కాపీని మండల ఏపీఎంకు పంపుతారు. తదుపరి ఈ పేరును ఆన్‌లైన్లో నమోదయ్యేలా చర్యలు చేపడతారు. గతంలో వీరికి తక్కువ వేతనం లభించినా, ప్రస్తుతం రూ.ఎనిమిది వేల జీతమొస్తోంది. దీంతో కూటమి నేతలు తమ కార్యకర్తల కుటుంబసభ్యులు, టీడీపీకి అనుకూలంగా ఉండే మహిళలను నియమించుకుంటూ నిబంధనలను అపహాస్యం చేస్తున్నారు. ఈ వ్యవహారంలో డీఆర్డీఏలో పనిచేస్తున్న ఓ కీలకాధికారి అంతా తానై చూసుకుంటున్నారని సమాచారం. ఆదుకోవాల్సిన అధికారులే తమ మెడపై కత్తిపెట్టి రాజీనామాలు చేయాలని వేధిస్తుండటంతో గోడును ఎవరికి తెలియజేయాలో పాలుపోక మదనపడుతున్నారు.

జిల్లాలో ఇలా..





సంగానికి చెందిన రమణమ్మ వీఓఏగా 20 ఏళ్లుగా వ్యవహరిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వందలాది మంది మహిళలను గ్రూపుల్లో చేర్పించి వారి ఆర్థిక ప్రగతికి బాటలేశారు. ఉద్యోగానికి రాజీనామా చేయాలంటూ ఆమెపై పచ్చ నేతలు బెదిరింపులకు దిగారు. కేసులు బనాయించి జైలుకు పంపుతామంటూ వేధింపుల పర్వానికి తెరలేపారు. దీంతో ఉద్యోగాన్ని వదులుకొని, మానసిక క్షోభకు గురవుతున్నారు.



వీఓఏల వ్యవస్థ ఏర్పడిన నాటి నుంచే సంగం మండలానికి చెందిన సంపూర్ణమ్మ పనిచేస్తున్నారు. రాష్ట్రస్థాయి నేతగా సహచరుల సమస్యలను పరిష్కరిస్తూ అంచలంచెలుగా ఎదిగారు. అక్రమ కేసులు బనాయిస్తామనే కూటమి నేతల హెచ్చరికల నేపథ్యంలో విధిలేక రాజీనామా చేయాల్సి వచ్చింది.

రాజీనామా చేయలేదు.. మరొకర్ని నియమించారు



గ్రామంలోని పొదుపు గ్రూపుల సభ్యులు నన్ను వీఓఏగా కొనసాగించాలని తీర్మానం చేశారు. దీనికి సంబంధించిన కాపీని అధికారులకు పంపాం. ఒత్తిళ్లు అధికమయ్యాయి. విధులకెళ్లకుండా ఇంటి వద్దే ఉన్నా. కూటమి నేతలు అత్యుత్సాహం ప్రదర్శించి మరో మహిళను వీఓఏగా నియమించారు. ప్రస్తుతం ఆమె పేరే ఆన్‌లైన్లో కనిపిస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా ఇలా.. ఎలా నమోదు చేశారో అధికారులకే తెలియాలి.

– మానస, విడవలూరు

కోర్టును ఆశ్రయించినా ఫలితం లేదు



రాజీనామా చేయాలంటూ గ్రామంలోని అధికార పార్టీ నేతలు ఒత్తిడి చేశారు. వీఓఏగా నేనే కొనసాగాలని గ్రూపు సభ్యులందరూ తీర్మానం చేశారు. అయితే నాయకులు, అధికారులు కుమ్మక్కై మరొకర్ని నియమించారు. ఈ విషయమై కోర్టును ఆశ్రయించినా ప్రయోజనం లేదు. ఉత్తర్వులను అధికారులు అమలు చేయడంలేదు.

– శిరీష, దాచూరు

నిబంధనల మేరకే..

వీఓఏల నియామకాలకు సంబంధించి నిబంధనల మేరకే నడుచుకుంటున్నాం. గ్రామంలో తీర్మానం చేసిన మహిళనే వీఓఏగా స్థానిక ఏపీఎంలు నియమిస్తున్నారు. ఇందులో ఉత్తర్వులను ఉల్లంఘించడంలేదు. కొత్తగా వచ్చిన వీఓఏలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి గ్రూపు మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా చర్యలు చేపడుతున్నాం.

– నాగరాజకుమారి, పీడీ, డీఆర్డీఏ

విశ్వావసుధైక..



చిన్నారుల నృత్య ప్రదర్శన

- కలెక్టరేట్లో ఘనంగా ఉగాది వేడుకలు
- పంచాంగ శ్రవణం
- పురస్కారాల అందజేత

నెల్లూరు(అర్బన్): విశ్వావసు నామ ఉగాది సంవత్సరాదిని నగరంలోని కలెక్టరేట్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. తెలుగుదనం ఉట్టిపడేలా.. పంచకట్టుతో హాజరైన కలెక్టర్ ఆనంద్, జేసీ కార్తీక్‌కు మంగళవాయిద్యాల నడుమ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. మా తెలుగుతల్లికి మల్లెపూదండ గీతంతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. పాడిపంటలు, పరిశ్రమల స్థాపనతో జిల్లా శరవేగంగా అభివృద్ధి చెందాలని కాంక్షించారు. ప్రజలందరూ కలిసికట్టుగా ఉంటూ జిల్లా అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు.



ఆశీర్వచనం అందజేస్తున్న వేదపండితులు

పంచాంగ పఠనం

పంచాంగాన్ని ఆలూరి శిరోమణి శర్మ పఠించారు. పంచాంగ శ్రవణంతో పుణ్య ఫలాలు సిద్ధిస్తాయని తెలిపారు. అనంతరం 11 మంది కవులు తమ కవితలతో ఆహూతులను అలరించారు. తొలుత జగమంత కుటుంబం నాది అనే కవితను సుభద్రాదేవి వినిపించారు. చెట్టును స్పర్శించు.. పర్యావరణాన్ని కాపాడు అనే అంశంపై అన్నపూర్ణ.. సమాజ విలువలను కాపాడాలంటూ ఉగాది సందేశాన్ని శ్రీధర్‌బాబు వినిపించారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ ఆనంద్

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. దాన వీర శూరకర్ణ చిత్రంలోని ఏమంటివి.. ఏమంటివి అంటూ ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు చేసిన ఐదు నిమిషాల నిడివిగల డైలాగులు ఆకట్టుకున్నాయి. అనంతరం పౌరాణిక నాటకరంగం నుంచి భద్రాచలం బాబు, కూచిపూడి నాట్యగురువు జమున, కీలుగుర్రం, బుట్టబొమ్మలకు సంబంధించి వెంకటరమణమ్మ, డప్పు కళాకారుడు శీనయ్య, శ్యామలాదేవి (హరికథ), విశ్వనాథం (బుర్రకథ), శ్రీనివాసకుమార్ (మిమిక్రీ), రసూల్ (స్వచ్ఛంద సంస్థ), ఉమాకిరణ్ (యాంకర్) తదితరులకు ఉగాది పురస్కారాలను కలెక్టర్ అందజేశారు. కవులు, పురస్కార గ్రహీతలను సత్కరించారు. మేయర్ స్రవంతి, ఆర్టీసీ రీజినల్ బోర్డు చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, డీఆర్వో ఉదయభాస్కర్‌రావు, ఆర్డీఓ అనూష, జిల్లా సమాచార, పౌరసంబంధాల శాఖ అధికారి సదారావు, టూరిజమ్ అధికారి శివనాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాకాణిపై కొనసాగుతున్న వేధింపులు



ఇంటి గేటుకు నోటీసులను అంటించిన పోలీసులు



హైదరాబాద్‌లో ఉగాది వేడుకల్లో కాకాణి

- విచారణకు నేడు హాజరుకావాలి
- ఇంటికి నోటీసులు అంటించిన పోలీసులు

నెల్లూరు(క్రైమ్): మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై వేధింపులను కూటమి ప్రభుత్వం కొనసాగిస్తోంది. ఆ పార్టీ వైఫల్యాలు, అవినీతి, అక్రమాలపై ఎప్పటికప్పుడు నిలదీస్తుండటంతో తప్పుడు కేసులతో వేధిస్తోంది. పొదలకూరు మండలం తాటిపర్తిలోని రుస్తుం మైన్స్‌లో అక్రమ మైనింగ్ జరిగిందని, ఇందులో కాకాణి అనుచరుల ప్రమేయం ఉందని, దీనికి ఆయన సహకరించారంటూ 120 (బీ), 447, 427, 379, 290, 506, 109 ఆర్ / డబ్ల్యూ 34 ఐపీసీ, సెక్షన్ 3 పీడీపీపీఏ, సెక్షన్ 3 అండ్ 5 ఆఫ్ ఈఎస్ యాక్ట్ అండ్ సెక్షన్ 21 (1), 21 (4) ఆఫ్ ఎమ్మెమ్డీఆర్ యాక్ట్ కింద నాన్‌బెయిలబుల్ కేసును పొదలకూరు పోలీసులు ఇటీవల నమోదు చేసిన విషయం విదితమే. ఈ కేసులో కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఏ – 4గా ఉన్నారు. కొద్ది రోజులుగా పోలీసులు అరెస్ట్ చేస్తారనే ప్రచార నేపథ్యంలో, అక్రమ కేసులు, అరెస్ట్‌లకు భయపడేదిలేదంటూ తన ఇంట్లోనే ఆయన ఉన్నారు. ఇంటి వద్ద కార్యకర్తలు, అభిమానులు పగలూ, రాత్రీ పహారా కాశారు. ఆ సమయంలో పోలీసులు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ఈ క్రమంలో ఉగాది పర్వదిన నేపథ్యంలో కుటుంబంతో కలిసి హైదరాబాద్‌కు శుక్రవారం వెళ్లి వేడుకలను ఆదివారం జరుపుకొన్నారు. ఆ ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. ఈ నేపథ్యంలో కాకాణిని ఇబ్బందులు పెట్టాలంటూ పోలీసులపై కూటమి నేతలు ఒత్తిడి తీసుకొచ్చారు. దీంతో అక్రమ మైనింగ్ కేసులో విచారణకు హాజరుకావాలంటూ నోటీసులను పొదలకూరు సీఐ శివరామకృష్ణారెడ్డి జారీ చేశారు. ఎస్సై హనీఫ్ తన సిబ్బందితో కలిసి మీడియాను వెంటబెట్టుకొని డైకస్‌రోడ్డులోని కాకాణి ఇంటికి ఆదివారం సాయంత్రం చేరుకున్నారు. అక్కడ ఎవరూ లేకపోవడంతో ఇంటి గేటుకు నోటీసులను అంటించి వెళ్లారు.

విచారణకు హాజరుకావాలి

విచారణ నిమిత్తం మూలాపేటలోని రూరల్ డీఎస్పీ కార్యాలయానికి సోమవారం ఉదయం 11కు హాజరుకావాలని నోటీసులో పొందుపర్చారు. కాకాణి బెయిల్ పిటిషన్‌పై కోర్టులో విచారణ మంగళవారం జరగనున్న నేపథ్యంలో ఓ పథకం ప్రకారమే నోటీసులను జారీ చేశారు. విచారణకు ఆయన సహకరించడంలేదనే సాకును చూపేందుకే నోటీసులను అంటించారని తెలుస్తోంది.

అంతా.. ఆరంభ శూరత్వమే

'కందుకూరులో చెత్త అనేదే లేకుండా చేస్తాం.. ఏ రోజు చెత్తను ఆ రోజే రీసైక్లింగ్ చేసి చెత్త నుంచి సంపదను సృష్టించే బాధ్యత నాది'.. అంటూ స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా పట్టణంలో ఫిబ్రవరి 15న నిర్వహించిన బహిరంగసభలో సీఎం చంద్రబాబు చేసిన వ్యాఖ్యలివి. అదే సమయంలో దూబగుంట వద్ద ఏర్పాటు చేసిన చెత్త రీసైక్లింగ్ కేంద్రాన్నీ ప్రారంభించారు. అయితే ఇది జరిగి 45 రోజులు దాటినా నేటికీ వినియోగంలోకి రాలేదు.

- వినియోగంలోకి రాని చెత్త రీసైక్లింగ్ కేంద్రం
- ఫిబ్రవరి 15న ఆర్భాటంగా ప్రారంభించిన సీఎం
- ప్రజాధనం వృథా
- కందుకూరులో ఇదీ దుస్థితి



అసంపూర్తిగా భవనాలు



దూబగుంట వద్ద ఏర్పాటు చేసిన రీసైక్లింగ్ మెషీన్

కందుకూరు: పట్టణంలో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన చెత్త రీసైక్లింగ్ కేంద్రం నిరుపయోగంగా మారింది. డంపింగ్ యార్డులో పేరుకుపోయిన చెత్త టన్నూ తొలగలేదు. దీంతో స్వచ్ఛ కందుకూరు అంటూ చేసిన ఆర్భాటం మాటలకే పరిమితమైందే తప్ప చేతల్లో ఏ మాత్రం కానరావడం లేదు. సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ప్రారంభించిన రీసైక్లింగ్ కేంద్రం వినియోగంలోకి రాకపోవడంపై పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. హడావుడి చేయడం మినహా ఎలాంటి ఉపయోగంలేదనే భావన ప్రజల్లో వ్యక్తమవుతోంది.

తలనొప్పిగా సమస్య

కందుకూరు మున్సిపాల్టీకి ప్రస్తుతం చెత్త సమస్య తలనొప్పిగా మారింది. దీని పరిధిలో 25 మెట్రిక్ టన్నుల వరకు చెత్త నిత్యం పోగవుతోంది. అయితే దీన్ని నిల్వ చేసేందుకు సరైన డంపింగ్ యార్డు సౌకర్యం లేదు. పట్టణంలోని యర్రగొండపాళెం సమీపంలో గల యార్డు ఇప్పటికే పూర్తిగా నిండిపోయింది. కనీసం లోపలికి తీసుకెళ్లే పరిస్థితే లేదు. దీంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో బయటే చెత్తను మున్సిపల్ కార్మికులు పడేస్తున్నారు. మరోవైపు నివాసాల మధ్యలో యార్డు ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెత్తకు నిప్పంటుకొని రోజుల తరబడి కాలుతుండటంతో ఆ ప్రాంతాలు పొగతో నిండిపోతున్నాయి. అక్కడి నుంచి తరలించాలనే ప్రతిపాదన ఎంతో కాలంగా ఉన్నా, స్థల సమస్యతో కార్యరూపం దాల్చడం లేదు.

టన్ను చెత్తనూ ప్రాసెస్ చేయలేదు

స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర అంటూ కందుకూరు పర్యటనకు ఫిబ్రవరిలో సీఎం వచ్చారు. దీంతో అధికారులు హడావుడిగా కనిగిరి రోడ్డులోని దూబగుంట వద్ద చెత్త రీసైక్లింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ దాదాపు రూ.45 లక్షలను వెచ్చించి యంత్రాలనూ నెలకొల్పారు. నిర్వహణ బాధ్యతను కండి మినరల్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ నిర్వహించేలా ఒప్పందమూ కుదిరింది. నిత్యం 24 టన్నుల చెత్తను రీసైక్లింగ్ చేసే సామర్థ్యం ఈ కేంద్రానికి ఉంది. అయితే దీన్ని ప్రారంభించి ఇప్పటికి 45 రోజులు దాటుతున్నా, ఒక్క టన్ను కూడా ప్రాసెస్ చేసిన దాఖలాల్లేవు. ఫలితంగా యంత్రాలు అలంకారప్రాయంగా మారాయి.

గుంటూరుకు తరలించేలా..?

కందుకూరులో ప్రారంభించిన చెత్త రీసైక్లింగ్ కేంద్రం వినియోగంలోకి వచ్చే పరిస్థితే లేదనే వాదనా వినిపిస్తోంది. ఫలితంగా ఇక్కడి నుంచి గుంటూరు తరలించి అక్కడే రీసైక్లింగ్ చేసేలా స్వచ్ఛాంధ్ర అధికారుల మధ్య చర్చలు జరుగుతున్నాయని సమాచారం. కందుకూరు నుంచి వాహనాల ద్వారా చెత్తను గుంటూరులోని కేంద్రానికి నిత్యం తరలించాలనే ప్రణాళిక అధికారుల పరిశీలనలో ఉంది. కేవలం సీఎం పర్యటన కోసమే కొన్ని యంత్రాలను అక్కడ పెట్టి, స్వచ్ఛ కందుకూరు అంటూ హడావుడి చేసి చేతులు దులుపుకొన్నారనే విమర్శలూ లేకపోలేదు.

స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ అధికారులు చూస్తున్నారు


చెత్త రీసైక్లింగ్ కేంద్ర నిర్వహణ బాధ్యతను స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ అధికారులు చూస్తున్నారు. రీసైక్లింగ్ బాధ్యతా వాళ్లదే. కేంద్రాన్ని ఎప్పటి నుంచి నిర్వహణలోకి తీసుకురావాలనే అంశాన్ని పరిశీలిస్తున్నారు. ఇక్కడి నుంచి చెత్తను గుంటూరు తరలిస్తారనే అంశమై మాకెలాంటి సమాచారం లేదు.

– అనూష, మున్సిపల్ కమిషనర్


జిల్లాలో పుచ్చ సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టాలు చవిచూస్తున్నారు. గత సంవత్సరం కంటే ఈసారి అనేకమంది సాగు చేపట్టడంతో విస్తీర్ణం కొంతమేర పెరిగింది. అయితే ప్రస్తుతం ధరల్లేక రైతులు దిగాలుగా ఉన్నారు.

- దిగుబడి ఉన్నా ధరల్లేవు
- జిల్లాలో అధికారికంగా 689 ఎకరాల్లో..
- అనధికారికంగా 2 వేల ఎకరాల్లో సాగు
- కిలో రూ.7కు అడుగుతున్న దళారులు
- గిట్టుబాటు కాదంటున్న రైతులు

విక్రయాలకు సిద్ధంగా ఉన్న పుచ్చకాయలు



పుచ్చ రైతులు.. నిండా మునిగారు



సాగులో ఉన్న పంట

పొదలకూరు: జిల్లా వ్యాప్తంగా 689 ఎకరాల్లో పుచ్చ సాగు ఉన్నట్లు ఉద్యాన శాఖ అధికారులు వెల్లడిస్తున్నారు. ఇందులో పొదలకూరు మండలంలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ప్రాంత రైతులు పుచ్చ సాగు చేపట్టారు. సుమారు 500 ఎకరాల్లో ఉన్నట్లు అంచనా. కాగా దళారులు కిలో పుచ్చకాయలను రూ.7కు మాత్రమే అడుగుతున్నట్లు రైతులు తెలిపారు. ఈ లెక్కన అమ్ముకుంటే సాగు ఖర్చులు కూడా రావని వాపోతున్నారు. కనీస ధర లభిస్తే వచ్చే ఏడాది కూడా సాగు చేపడతామని అంటున్నారు.

పెరిగిన ఖర్చులు

గతంతో పోలిస్తే పుచ్చ సాగుకు ఈ ఏడాది పెట్టుబడులు పెరిగాయి. ఎకరాకు రూ.40 వేల వరకు ఖర్చవుతోంది. మల్చింగ్ (పాలిథిన్ పట్ట) పద్ధతిలో సాగు చేస్తే ఎకరాకు రూ.20 వేలు అదనం. మల్చింగ్ వల్ల దిగుబడి పెరుగుతుంది. మల్చింగ్ లేకుండా సాగు చేస్తే గడ్డి బాగా పెరిగి పుచ్చకాయలు బరువు లేకుండా దిగుబడి అయ్యే అవకాశం ఉంది. ఈ ప్రాంతంలో చాలామంది రైతులు మల్చింగ్ పద్ధతిలోనే సాగు చేశారు. దిగుబడి 70 నుంచి 80 రోజుల్లో ఉంటుంది. అనధికారిక లెక్కల ప్రకారం జిల్లాలో సుమారు 1,500 నుంచి 2 వేల ఎకరాల్లో పుచ్చ సాగు ఉంటుందని అంచనా. యాజమాన్య పద్ధతులు తక్కువగా ఉన్నందువల్ల ధరలు పెరిగితే ఆదాయం బాగుంటుందని రైతులు దీని వైపు వెళ్లారు. అయితే ఈ ఏడాది నష్టపోయే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఒక టన్నుకు రూ.10 వేల వరకు ధర పలికితే రైతుకు ఊరట లభిస్తుంది. అయితే రూ.6 వేల నుంచి రూ.7 వేల వరకు మాత్రమే ఉంది. దళారులు ధరల్లేవని రైతుల నుంచి తక్కువ ధరకు పుచ్చకాయలను కొనుగోలు చేస్తున్నారు. ఎక్కువ రోజులు నిల్వ ఉండని పచ్చి సరుకు కావడంతో రైతులు ధరల గురించి పట్టించుకోకుండా తెగ నమ్ముకుంటున్నారు.

ఎగుమతి లేక..

ఈ ప్రాంతంలో రెండు రకాల పుచ్చ సాగు చేస్తున్నారు. వాటిలో నల్ల రంగు కాయలు ఎక్కువ రోజులు నిల్వ ఉంటాయి. పచ్చ రంగు చారలున్న కాయలు తక్కువ రోజులు నిల్వ ఉంటాయి. అయితే పచ్చ రంగున్న కాయలు టన్నేజీ బాగా వస్తుందని దిగుబడి కూడా ఉంటుందనేది రైతుల మాట. జిల్లా నుంచి పుచ్చకాయల ఎగుమతి సక్రమంగా లేకపోవడంతో ధరలు పతనమవుతున్నట్లు తెలుస్తోంది. కొందరు రైతులు ట్రాక్టర్లలో కాయలను లోడ్ చేసుకుని పట్టణాలకు తీసుకెళ్లి అమ్ముకుంటున్నారు. అయినా వారికి గిట్టుబాటు కావడంలేదని తెలుస్తోంది. కిలో ధర రూ.10 పలుకుతున్నా ఇబ్బందులు పడుతున్నారు.

పుచ్చసాగుతో నష్టం



నేను పుచ్చ సాగు చేసి నష్టపోయాను. గతంలో కొంతవరకు లాభం రావడంతో మళ్లీ సాగు చేశాను. ఈ పర్యాయం తీవ్రంగా నష్టం వచ్చేలా ఉంది. అధికారులు చొరవ తీసుకుని గిట్టుబాటు ధరలు కల్పించాలి.

– జి.హరి, రైతు, నావూరుపల్లి

రైతులకు గడ్డుకాలం



పుచ్చ సాగు చేసిన రైతులకు గడ్డుకాలం వచ్చింది. ఎకరాకు రూ.40 వేల నుంచి రూ.50 వేలు ఖర్చు చేశాం. పెట్టుబడులు వచ్చినా సంతోషమే. రైతులు నేరుగా వెళ్లి బజార్లలో అమ్ముకుంటే కొంతవరకు మేలే. అయితే అందరూ ఆ పని చేయలేరు.

– కేతు రామిరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు, దుగ్గుంట

ఆదుకోవాలి



పుచ్చ సాగు చేసిన రైతులను ఆదుకోవాలి. ఈ ఏడాది దిగుబడి కూడా అంతంతమాత్రమే. పెట్టుబడులు వస్తే ఆదాయం వచ్చినట్లే. దళారులు దారుణంగా అడుగుతున్నారు.

– వి.మాలకొండారెడ్డి, రైతు, నావూరు

రైతు బజార్లలో అమ్ముకోవచ్చు



రైతులు ముందుకొస్తే రైతు బజార్లలో అమ్ముకునే అవకాశం కల్పిస్తాం. నెల్లూరు, కావలి తదితర ప్రాంతాల్లో కాయలను విక్రయించుకోవచ్చు. పుచ్చ ధరలు దారుణంగా పడిపోలేదని భావిస్తున్నాం. మమ్మల్ని సంప్రదిస్తే సలహాలిస్తాం.

– సుబ్బారెడ్డి, జిల్లా ఉద్యానాధికారి, నెల్లూరు

సీసీ కెమెరాల షాపులో అగ్నిప్రమాదం



నిచ్చెన సాయంతో పక్కనున్న భవనంపైకి వెళ్తున్న అగ్నిమాపక సిబ్బంది



ఎగసి పడుతున్న మంటలు

- రూ.50 లక్షల మేర ఆస్తి నష్టం

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు విక్రమ్ నగర్‌లోని సీసీ కెమెరాల దుకాణంలో శనివారం రాత్రి భారీ అగ్నిప్రమాదం జరిగింది. దీంతో స్థానికంగా ఉన్న ప్రజలు భయాందోళనకు గురయ్యారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని ఆరుగంటలపాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అగ్నిమాపక అధికారుల కథనం మేరకు.. నగరానికి చెందిన శ్రీధర్ విక్రమ నగర్‌లోని రెండంతస్తుల భవనంలో కింద పోర్షన్‌లో కార్యాలయం, పై పోర్షన్‌లో సీసీ కెమెరాల షాపు నిర్వహిస్తున్నాడు. శనివారం రాత్రి ఎప్పటిలాగే పదిగంటల సమయంలో వాటిని మూసివేశాడు. సుమారు 11 గంటల ప్రాంతంలో పైపోర్షన్‌లో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. స్థానికులు అగ్నిమాపక అధికారులు, వేదాయపాళెం పోలీసులకు సమాచారం అందించారు. నెల్లూరు ఏడీఎఫ్ఓ ఎస్.వేణుగోపాల్ రెండు ఫైరింజిన్లతో ఘటనా స్థలానికి చేరుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది ఫైరింజిన్లతో నీరు వేగంగా కొట్టినా, ఫోమ్‌ను ఉపయోగించినా మంటలను అదుపు చేయలేకపోయారు. దీంతో సిబ్బంది పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్‌లోని ఫ్లాట్‌ల కిటికీలో నుంచి దానికి ఆనుకుని ఉన్న మూడంతస్తుల భవనంపైకి చేరుకుని ఆరుగంటలపాటు శ్రమించి మంటల్ని అదుపులోకి తీసుకొచ్చారు. వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని అగ్నిమాపక సిబ్బందికి సహకారం అందించారు. సీసీ కెమెరాలకు సంబంధించిన వైర్లు, బ్యాటరీలు, అడాప్టర్‌లు ఇలా కాలే సామగ్రి అధికంగా ఉండటంతోనే మంటలు అదుపులోకి తీసుకురావడం కష్టంగా మారిందని అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు. బ్యాటరీలు లేదా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ద్వారా అగ్నిప్రమాదం జరిగి ఉండొచ్చని భావిస్తున్నారు. ఈ ఘటనలో సుమారు రూ.45 లక్షల నుంచి రూ.50 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు.

టిప్పర్ చక్రాల కింద పడి వ్యక్తి మృతి

- తమ్ముడికి తీవ్రగాయాలు



మృతదేహాన్ని తరలిస్తున్న పోలీసులు

నెల్లూరు(క్రైమ్): మోటార్‌బైక్‌పై వెళ్తూ టిప్పర్‌ను అధిగమించే క్రమంలో వెనుక చక్రాల కిందపడి అన్న మృతిచెందగా తమ్ముడికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం నెల్లూరు బోసుబొమ్మ సమీపంలోని ఆర్‌కేటీ పెట్రోల్ బంకు వద్ద చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. బిహార్ రాష్ట్రానికి చెందిన హరిరామ్‌కుమార్ (23), సీతారామ్ అనే అన్నదమ్ములు నాలుగు నెలల క్రితం ఉపాధి నిమిత్తం నెల్లూరు నగరానికి వచ్చి పొర్లుకట్ట వద్ద నివాసం ఉంటున్నారు. బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. హరిరామ్‌కుమార్‌కు తొమ్మిది నెలల క్రితం వివాహమైంది. ఆదివారం సాయంత్రం అన్నదమ్ములిద్దరూ బైక్‌పై బోసుబొమ్మ వైపునకు బయలుదేరారు. ఆర్‌కేటీ పెట్రోల్ బంకు వద్దకు వచ్చేసరికి ముందు వెళ్తున్న టిప్పర్‌ను అధిగమించే క్రమంలో బైక్ దానికి రాసుకుంది. దీంతో బైక్ అదుపు తప్పి అన్నదమ్ములిద్దరూ కిందపడ్డారు. టిప్పర్ చక్రాల కిందపడి హరికుమార్ తలపగిలి అక్కడికక్కడే మృతిచెందగా, సీతారామ్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడిని 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ప్రమాద ఘటనపై సమాచారం అందుకున్న నార్త్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు. టిప్పర్‌ను స్వాధీనం చేసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు.

నాలుగు నెలల్లో ఘాట్ నిర్మాణం పూర్తి

- మంత్రి నారాయణ



పెన్నా ఘాట్‌ను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ

నెల్లూరు(బృందావనం): రంగనాయకులపేటలోని శ్రీదేవి, భూదేవి సమేత తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో ఘాట్ నిర్మాణాన్ని నాలుగు నెలల్లో పూర్తి చేస్తామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. ఉగాది సందర్భంగా నారాయణ, రమాదేవి దంపతులు ఆదివారం రంగనాథస్వామిని దర్శించుకున్నారు. అనంతరం స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, అర్చకులతో కలిసి మంత్రి పెన్నా ఘాట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన నారాయణ మాట్లాడుతూ 15 రోజుల్లో టెండర్లు పిలిచి నాలుగు నెలల్లో ఘాట్ నిర్మాణాన్ని పూర్తి చేస్తామన్నారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు రాష్ట్రంలోని అన్ని ఆలయాలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. అనంతరం నారాయణ, రమాదేవి దంపతులు వీఆర్సీ సెంటర్ చాకలివీధిలోని శ్రీమహాలక్ష్మమ్మ ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు.

క్లుప్తంగా

ఈద్‌ను సంతోషంగా జరుపుకోవాలి



కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు(బృందావనం): మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ముస్లింలకు ఈద్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పండగను సుఖసంతోషాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు.

ఒకేరోజు 96 రిజిస్ట్రేషన్లు

నెల్లూరు సిటీ: ఆదివారం సెలవు దినమైనా రిజిస్ట్రేషన్ కార్యాలయాలు జరిగాయి. ఒకేరోజులో 96 రిజిస్ట్రేషన్లు జరిగినట్లుగా జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు తెలిపారు. రూ.19,65,336 రాబడి వచ్చినట్లు వెల్లడించారు. సోమవారం రంజాన్ పండగా అయినా రిజిస్ట్రేషన్లు జరుగుతాయని వెల్లడించారు.

కండలేరులో 48.794 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 48.794 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సత్యసాయి గంగ కాలువకు 1,320, పిన్నేరు కాలువకు 5, లోలెవల్ కాలువకు 40, హైలెవల్ కాలువకు 30, మొదటి బ్రాంచ్ కాలువకు 10 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

మిద్దెపై వాకింగ్ చేస్తుండగా..

- ప్రమాదవశాత్తు కింద పడి మహిళ మృతి

నెల్లూరు(క్రైమ్): ప్రమాదవశాత్తు మిద్దె పైనుంచి కిందపడి ఓ మహిళ మృతిచెందిన ఘటన నెల్లూరు అయ్యప్పగుడి సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. ఎన్జీఓ కాలనీకి చెందిన జ్యోతి (49), పురుషోత్తం దంపతులకు కుమారుడు, కుమార్తె సంతానం. జ్యోతి వారంరోజుల క్రితం అయ్యప్పగుడి సమీపంలో నివాసముంటున్న తన తల్లి సరస్వతమ్మ వద్దకు వెళ్లింది. శనివారం రాత్రి ఆమె వాకింగ్ చేసేందుకు మిద్దెపైకి వెళ్లింది. కొద్దిసేపటికి సరస్వతమ్మ వెళ్లి చూడగా కుమార్తె కనిపించలేదు. దీంతో ఆమె కిందకు వచ్చిచూడగా కుమార్తె తలకు తీవ్రగాయమై రోడ్డుపై అపస్మారక స్థితిలో పడి ఉంది. దీంతో సరస్వతమ్మ జరిగిన విషయాన్ని తన మనవడు లీలామోహన్‌కు తెలియజేసింది. అతను వెంటనే ఇంటి వద్దకు చేరుకుని తల్లిని చికిత్స నిమిత్తం జయభారత్ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. డాక్టర్ల సూచన మేరకు నారాయణ హాస్పిటల్‌కు తరలించాడు. చికిత్స పొందుతూ ఆమె ఆదివారం తెల్లవారుజామున మృతిచెందింది. మృతురాలి కుమారుడు వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కోడిపందేల స్థావరంపై దాడి

నెల్లూరు సిటీ: రూరల్ నియోజకవర్గంలో కోడిపందేల స్థావరంపై రూరల్ పోలీసులు ఆదివారం దాడి చేశారు. వారి కథనం మేరకు.. నారాయణరెడ్డిపేటలోని ఖాళీ స్థలంలో కోడిపందేలు నిర్వహిస్తున్నారని సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి వెళ్లి 11 మందిని అదుపులోకి తీసుకున్నారు. రూ.11,250 నగదును స్వాధీనం చేసుకున్నారు.

తలోదారిలో తెలుగు తమ్ముళ్లు

- ఉదయగిరి నియోజకవర్గంలో అసమ్మతి సెగలు
- నానాటికీ పెరుగుతున్న విభేదాలు
- ఎమ్మెల్యే సమక్షంలోనే కొట్లాట
- కాకర్లపై సీఎంకు ఫిర్యాదు చేసిన సీనియర్ నేతలు
- లోకేశ్ అండదండలతో సీరియస్‌గా తీసుకోని శాసనసభ్యుడు



గొడవ పడుతున్న పార్టీ నేతలు (ఫైల్)

ఉదయగిరి: నియోజకవర్గంలోని పలు మండలాల్లో తెలుగు తమ్ముళ్ల మధ్య విభేదాలు బుసలు కొడుతున్నాయి. అంతర్గతంగా ఉన్న విభేదాలు తన్నులాటకు దారి తీస్తున్నాయి. అది కూడా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సమక్షంలోనే ఈ గొడవలు, దెబ్బలాటలు జరుగుతుండటం విశేషం. ముఖ్యంగా కాకర్ల, మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకట రామారావు వర్గీయులు మధ్య గొడవలు చోటు చేసుకుంటున్నాయి. కాకర్ల తన వర్గీయులను సమర్థిస్తూ తమపైకి ఉసిగొల్పుతున్నాడనే అనుమానం బొల్లినేని వర్గీయుల్లో ఉంది.

ఇలా మొదలు

సార్వత్రిక ఎన్నికలకు రెండేళ్ల ముందు సురేష్ సేవా కార్యక్రమాల పేరుతో నారా లోకేశ్ ఆశీస్సులు తీసుకుని ఉదయగిరిలో మకాం పెట్టారు. ఈ పరిణామం అప్పటి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జీగా ఉన్న బొల్లినేనికి నచ్చలేదు. దీంతో కాకర్ల సేవా కార్యక్రమాలకు సహకరించలేదు. లోకేశ్ అండదండలు ఉండటంతో ఇబ్బందులు ఎదురైనా సురేష్ తమ కార్యకలాపాలు ఆపలేదు. గ్రామాల్లో బృందాలను ఏర్పాటు చేసుకుని రామారావు వర్గానికి దీటుగా నిలిచారు. పార్టీ అధినేత చంద్రబాబు మద్దతు పూర్తిగా తనకే ఉందని బొల్లినేని నమ్మారు. యువగళం పాదయాత్రలో లోకేశ్‌కు భారీ కటౌట్లు ఏర్పాటు చేసి స్వాగతం పలికేందుకు ప్రయత్నించిన సురేష్‌ను బొల్లినేని వర్గీయులు అడ్డుకున్నారు. ఇదంతా గమనించిన లోకేశ్ స్వయంగా సురేష్‌తో మాట్లాడి టికెట్‌పై హామీ ఇచ్చారు. ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత మండలాల వారీగా తనను ఇబ్బంది పెట్టిన బొల్లినేని వర్గీయులను దూరం పెట్టడం ప్రారంభించారు. దీంతో గ్రామాల్లో టీడీపీలో విభేదాలు నెలకొన్నాయి.

ఎమ్మెల్యే సమక్షంలోనే..

- ఈనెల 26వ తేదీన ఉదయగిరిలో ఎమ్మెల్యే కాకర్ల సమక్షంలో రెండు చోట్ల తమ్ముళ్లు తగాదా పడ్డారు. జెడ్పీ మాజీ చైర్మన్ చెంచలబాబు యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మన్నేటి వెంకటరెడ్డి వర్గాల మధ్య గొడవ జరిగింది. దీనిపై కాకర్ల మౌనం వహించారు. దీంతో చెంచలబాబు మనస్తాపం చెందినట్లు సమాచారం. దీనిపై పోలీసులకు కూడా ఇరువర్గాలు ఫిర్యాదు చేసుకున్నాయి.
- 27వ తేదీ రాత్రి వింజమూరు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కాకర్ల ముందే కొండాపురం టీడీపీ సీనియర్ నేతల మధ్య గొడవ జరిగింది. కాకర్ల వర్గానికి చెందిన జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దామా మహేశ్వరరావు, బొల్లినేని వర్గానికి చెందిన సొసైటీ మాజీ అధ్యక్షుడు యారవ కృష్ణయ్య మధ్య గొడవ జరిగి చెయ్యి చేసుకునే వరకు వెళ్లింది. దీంతో యారవ మనస్తాపం చెంది క్యాంప్ కార్యాలయం నుంచి అలిగి వెళ్లిపోయారు. ఈ విషయాన్ని జిల్లా పార్టీ పెద్దల దృష్టికి ఆయన తీసుకెళ్లారు. దీంతో వారు కాకర్లను పిలిచి మహేశ్వరరావుపై చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ నేపథ్యంలో పెద్దల ఆదేశాల మేరకు ఎమ్మెల్యే శనివారం రాత్రి ఆ రెండు వర్గాలను పిలిచి మాట్లాడారు. రాజీ చేసేందుకు ప్రయత్నించారు. ఆ సమయంలోనూ రెండు వర్గాలు మరోసారి గొడవ పడ్డాయి. కాకర్ల జోక్యం చేసుకుని అంతా మర్చిపోవాలన్నారు. ఇద్దరి చేతులు కలిపి పనిచేయాలని సూచించారు. కాగా ఆరునెలలపాటు కొండాపురం మండలంలో పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని దామాను ఎమ్మెల్యే ఆదేశించారు. దీంతో ఆయన, అనుచరులు అలకబూని వెళ్లిపోయారు.
- వరికుంటపాడు మండలంలో టీడీపీలో విభేదాలున్నాయి. ఇక్కడ బొల్లినేని వర్గీయులకు ఎమ్మెల్యే ప్రాధాన్యం ఇస్తూ.. తమను దూరం పెడుతున్నారనే భావన సురేష్ వర్గీయుల్లో ఉంది.
- దుత్తలూరు మండలంలో తమకు పూర్తి స్థాయి ప్రాధాన్యత ఇవ్వలేదనే బాధతో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి మదన పడుతున్నారు. పైగా ఇటీవల బొల్లినేని, కంభం కలిసి కొంతసేపు ముచ్చటించుకోవడం, ప్రస్తుతం ఎమ్మెల్యే పాల్గొంటున్న కార్యక్రమాల్లో కంభం కనిపించకపోవడం చర్చనీయాంశంగా మారింది. గత ఎన్నికల్లో పూర్తిగా సహకరించిన మాజీ ఎమ్మెల్యేలు మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, ఒంటేరు వేణుగోపాల్‌రెడ్డిలు ఎమ్మెల్యే కాకర్ల పట్ల కినుక వహించారనే ప్రచారం జరుగుతోంది.

సీఎంకు ఫిర్యాదు

ఇటీవల నియోజవర్గానికి చెందిన కొందరు సీనియర్ నేతలు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తమకు ప్రాధాన్యత ఇవ్వలేదని, ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉన్నారంటూ సీఎం చంద్రబాబుకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దీని వెనుక బొల్లినేనితోపాటు మాజీ ఎమ్మెల్యేల పాత్ర ఉందని కాకర్ల అనుమానిస్తున్నారు. పార్టీని బలోపేతం చేస్తున్నానని, కొందరు కావాలని ఫిర్యాదు చేస్తున్నారని ఆయన అధినేతకు చెప్పినట్లు తెలుస్తోంది.

రిజిస్ట్రేషన్లకు స్లాట్ బుకింగ్ పద్ధతి

- 2వ తేదీ నుంచి నెల్లూరులో ప్రారంభం
- గంటకు ఆరు రిజిస్ట్రేషన్లు చేసుకునే అవకాశం
- స్లాట్ తేదీల మార్పునకు రూ.200 చెల్లించాల్సిందే..



రిజిస్ట్రేషన్ కార్యాలయం

నెల్లూరు సిటీ: ఆస్తి లావాదేవీల రిజిస్ట్రేషన్లకు ఇక స్లాట్ బుకింగ్ విధానాన్ని అమలు చేయనున్నారు. నిర్దేశించిన సమయంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. జిల్లాలోని ఆర్ఓ కార్యాలయంలో ఏప్రిల్ 2వ తేదీ నుంచి దీనిని ప్రారంభించనున్నారు. నెలాఖరు నాటికి దశల వారీగా అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలు చేయనున్నట్లు జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు పేర్కొన్నారు.

ఎలా అంటే..

స్లాట్ బుకింగ్ విధానంలో గంటకు ఆరు రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. వినియోగదారులు మంచిరోజు, వారికి అనుకూలమైన రోజులో రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు సంబంధిత వెబ్‌సైట్‌లో బుక్ చేసుకోవచ్చు. నిర్దేశించిన సమయానికి కార్యాలయానికి రావాల్సి ఉంటుంది. అప్పుడు రాలేని పరిస్థితుల్లో తిరిగి స్లాట్ బుకింగ్ చేసుకోవాలి. అందుకు గానూ ప్రభుత్వానికి మరో రూ.200 చెల్లించాల్సి ఉంటుంది.

అమలు చేస్తాం

స్లాట్ బుకింగ్ విధానాన్ని మొదట నెల్లూరు ఆర్ఓ కార్యాలయంలో వచ్చే నెల 2వ తేదీన ప్రారంభిస్తాం. నెలాఖరుకు అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ విధానాన్ని అమలు చేస్తాం.

– బాలాంజనేయులు, జిల్లా రిజిస్ట్రార్

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 140	బ్రాయిలర్	
లేయర్ (లైవ్)	: 95	స్కిన్‌లెస్	: 280
బ్రాయిలర్ చికెన్	: 254	లేయర్ చికెన్	: 162



నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి :రూ.88
సన్నవి :రూ.60
పండ్లు :రూ.35

